బంగారు ఆభరణాలు పట్టివేత

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

వివరాలు వెల్లడిస్తున్న సిఐ అబ్దుల్‌కరీం

ఎన్నికల కోడ్‌లో భాగంగా పట్టణంలో సుమారు రూ.17 లక్షలు విలువైన బంగారు ఆభరణాలను పోలీసులు సీజ్ చేశారు. ఎస్‌పి సిద్దార్థ్ కౌశల్ ఉత్తర్వులు మేరకు డిఎస్‌పి మురళీధర్ ఆధ్వర్యంలో శుక్రవారం టూ టౌన్ సిఐ అబ్దుల్ కరీం, ఎస్‌ఐ రామకృష్ణ సిబ్బందితో కలిసి ఆర్‌టిసి బస్టాండ్ వద్ద తనిఖీ చేస్తుండగా కోయంబత్తూర్ పట్టణానికి చెందిన రాజారామ్ కరుప్పుస్వామి వద్ద బంగారు ఆభరణాలు ఉండడానికి గమనించి స్వాధీనం చేసుకున్నారు. 400 గ్రాముల బంగారు విలువ సుమారు 17 లక్షలుంటాయని, వాటికి సంబంధించి ఎలాంటి బిల్లులు చూపనందున సీజ్ చేశామని సిఐ పేర్కొన్నారు.

కూటమికి సర్దుపోట్లు?

- జమ్మలమడుగు అభ్యర్థిత్వాలపై చర్చ!
- ఎమ్మెల్యే టికెట్ వైపు భూపేష్‌రెడ్డి మొగ్గు
- ఆత్మీయ సమావేశంలో చర్చకు అవకాశం

అరవ శ్రీధర్

సుగవాసి బాలసుబ్రమణ్యం

ఆదినారాయణరెడ్డి

భూపేష్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కూటమికి సర్దుపోట్లు తప్పడం లేదు. టికెట్ల కేటాయింపుల్లో స్పష్టత కొరవడిన ఫలితంగా మార్పు చేర్పులకు శ్రీకారం చుట్టింది. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు ఎమ్మెల్యే అభ్యర్థి యనమల భాస్కర్‌రావు స్థానంలో అరవ శ్రీధర్‌ను ప్రకటించిన సంగతి తెలిసిందే. టిడిపి జమ్మలమడుగు టికెట్‌ను బిజెపికి కేటాయించింది. అప్పటికే జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థిగా భూపేష్‌రెడ్డి పాదయాత్ర ద్వారా ప్రజలకు చిరపరిచితునిగా మారడం తెలిసిందే. టిడిపి అధిష్టానం టికెట్ల కేటాయింపుల్లో తొందరపాటు నిర్ణయాలు తీసుకుంది. టిడిపి అభ్యర్థులు ఆశించిన స్థానాలను కూటమికి కేటాయించాల్సి వచ్చింది. జమ్మలమడుగు, రాజంపేట, రైల్వేకోడూరు స్థానాల్లో టిడిపికి పట్టు ఉంది. ఈ స్థానాలను కూటమి అభ్యర్థులకు వదులుకోవడంతో కూటమిలో అంతర్మథనం నెలకొంది. రాజంపేట అసెంబ్లీ టికెట్‌ను పార్లమెంట్ అభ్యర్థిగా ప్రచారం సాగిన సుగవాసి బాలసుబ్రమణ్యానికి కేటాయించింది. రాజంపేట ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్రాయుడు ఆశించారు. రైల్వేకోడూరులో కూటమి అభ్యర్థి భాస్కర్‌రావు మార్పు అనివార్యంగా మారింది. వైసిపి అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు నాలుగు దఫాలుగా గెలవడంతో వ్యతిరేకత కనిపిస్తోంది. టిడిపి అధిష్టానం అభ్యర్థిని బరిలో నిలిపి ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. టికెట్‌ను జనసేనకు కేటాయించింది. జనసేన ఎవరికీ తెలియని భాస్కర్‌రావు పేరును ప్రకటించింది. టికెట్ కేటాయింపు వ్యవహారం పట్ల వ్యతిరేకత వ్యక్తం కావడం తెలిసిందే. సర్వే పేరుతో అరవ శ్రీధర్ పేరును ప్రకటించాల్సి వచ్చింది. జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థిత్వంపై అసంతృప్తి నెలకొంది. కూటమిలో అసంతృప్తు నెలకొంది. ఫలితంగా జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థిగా భూపేష్‌రెడ్డికి కేటాయించే అవకాశాలు ఉన్నాయనే ఊహాగానాలు ఉన్నాయి. టిడిపి అధిష్టానం కూటమి తరుపున జమ్మలమడుగు టికెట్‌ను బిజెపికి వదులుకుంది. బిజెపి తరుపున మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి బరిలో దిగనుండడం, భూపేష్‌రెడ్డిని పార్లమెంట్ బరిలో నిలపడంతో ఎక్కడో వ్యత్యాసం కనిపిస్తోంది. జమ్మలమడుగు వంటి ఫ్యాక్షన్ ప్రాంతంలో కూటమి ఓటర్లు పూర్తిస్థాయిలో కమలానికి బదలాయింపు కావడం ఎంతవరకు సాధ్యమనే అనే సందేహాలూ ఉన్నాయి హోరాహోరీ పోరుతప్పని ప్రాంతంలో రెండు, మూడు శాతం ఓట్ల తేడాతో గెలుపు ఓటములను ప్రభావితం చేసే అవకాశాలు ఉన్న నేపథ్యంలో మార్గాంతరమేమిటనే ప్రశ్న వేధిస్తోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో తాజా ఆత్మీయ సమావేశంలో కూటమి అభ్యర్థుల్లో మార్పుచేర్పులపై చర్చ నడిచే అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది.

హంతకులు, నిజాయితీకి మధ్య పోటీ

బస్సుయాత్రలో వైఎస్.షర్మిల

ప్రజాశక్తి-కాశినాయన/కలసపాడు/పోరుమామిళ్ల/బద్వేలు/అట్లూరు

కడప పార్లమెంట్ ఎన్నికలు హంతకులు, నీతి నిజాయితీపరుల మధ్య జరుగుతున్నాయని పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల అన్నారు. శుక్రవారం బద్వేలు నియోజవకర్గంలోని కాశినాయన మండలం అమగంపల్లెలో ఆమె బస్సుయాత్రను ప్రారంభించారు. అక్కడి నుంచి కలసపాడుకు చేరుకుని సెయింట్ పాల్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పోరుమామిళ్ల, బి.కోడూరు, బద్వేలు, అట్లూరు మండలాల్లో బస్సుయాత్ర తొలిరోజు సాగింది. బస్సుయాత్ర సందర్భంగా షర్మిల మాట్లాడుతూ మా చిన్నాన్న, సోదరి సునీత తండ్రి, మాజీ సిఎం వైఎస్ఆర్ తమ్ముడు వివేకానందరెడ్డిని గొడ్డలితో హత్య చేసి హింసాత్మకంగా చంపిన వ్యక్తికి సిఎం వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి పార్లమెంట్ అభ్యర్థిగా నిలబెడుతున్నాడని పేర్కొన్నారు. హంతకులను చట్ట సభలకు వెళ్లకుండా చేసేందుకు కడప పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానన్నారు. చిన్నాన్న వివేకా చివరి కోరిక నేను ఎంపీగా పోటీ చేయడమేనన్నారు. అందుకే ఈ రోజు హంతకులకు వ్యతిరేకంగా నిలబడి పోటీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వివేకానందరెడ్డిని చంపి ఐదేళ్లయినా హంతకులను ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. సాక్షాధారాలతో ఇటు ప్రజలు అటు సిబిఐ అధికారులు తేల్చినా, అన్ని సాక్షాలు ఉన్నా వివేకానందరెడ్డిని చంపించిన హంతకున్ని జగన్మోహన్‌రెడ్డి ఎందుకు వెంట బెట్టుకుని తిరుగుతున్నాడని ప్రశ్నించారు అలాంటి హంతకులను పార్లమెంట్ పంపించేందుకు జగన్ సిద్ధపడ్డాడని, వీరిద్దరినీ మనం ఓడిస్తే తప్ప ఈ రాష్ట్రం బాగుపడదని పేర్కొన్నారు. హంతకులు జిల్లాను పరిపాలించడం మీకు ఇష్టమా అని ప్రశ్నించారు. మన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి స్వార్థ రాజకీయాల కోసం రాష్ట్రాన్ని బిజెపికి తాకట్టు పెట్టి ఏమాత్రం అభివృద్ధి చేయలేదని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కానీ పోలవరం కానీ కడప స్టీల్ ప్లాంట్ గాని ఏవి కేంద్రాన్ని అడక్కుండా బిజెపికి తొత్తులుగా వ్యవహరిస్తూ రాష్ట్రాన్ని పూర్తిగా నాశనం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కడప ఉక్కు పరిశ్రమ కూడా లేదని తెలిపారు. కడప ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపనల ప్రాజెక్టుగా మార్చారన్నారు. జగన్ రెండు సార్లు ముఖ్యమంత్రి అయ్యాక శంకు స్థాపన చేశారు తప్పితే ఉపయోగం లేదన్నారు. వివేకా కుమార్తె సునీత మాట్లాడుతూ తన తండ్రి వివేకానందరెడ్డి చివరి కోరిక తీర్చేందుకు ముందు వచ్చిన షర్మిలకు ప్రతి ఒక్కరు ఓటు వేయాలన్నారు. వివేకాను చంపింది ఎవరు అనే విషయం బట్టబయలైనా అవినాష్‌రెడ్డిని ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. హత్య రాజకీయాలు మీకు కావాలా మంచి పరిపాలన మీకు కావాలా అని ప్రజలు తేల్చుకోవాలన్నారు. ఓటు అనే ఆయుధంతో అవి నాష్‌రెడ్డిచాలని కోరారు. పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పగ్గాలు చేపట్టి కడప పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారంటే అది మనందరి అదృష్టమని భావించాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి మళ్ళీ పూర్వ వైభవం వస్తుందని వైఎస్ఆర్ పాలన వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బద్వేల్ కాంగ్రెస్ అభ్యర్థి విజయజ్యోతి మాట్లాడుతూ ఐదేళ్లలో జగన్ ప్రభుత్వంలో నియోజకవర్గం ఏమి అభివృద్ధి చెందిందో ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. భూ కబ్జాలు, ఇసుక మాఫియా, ఎక్కడపడితే అక్కడ దౌర్జన్యాలు తప్ప ఏమి అభివృద్ధి చెందలేదని విమర్శించారు. కార్యక్ర మంలో డిసిసి అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు పాల్గొన్నారు. కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, ఆమె భర్త రామ్మోహన్‌రావు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆమగంపల్లె వద్ద బస్సుయాత్ర సందర్భంగా వారికి పార్టీ కండువా వేసి షర్మిల పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రజలకు అభివాదం తెల్పుతున్న వై.ఎస్.షర్మిల, సునీత, ఎన్.డి.విజయజ్యోతి

నగరంలో శ్రీలీల సందడి

కళ్యాణ్ జ్యువెలరీ షోరూం ప్రారంభం

ప్రజలకు అభివాదం తెల్పుతున్న నటి శ్రీలీల

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలో ప్రముఖ సినీనటి శ్రీలీల సందడి చేశారు. శుక్రవారం నగరంలో కొత్తగా తీర్చిదిద్దిన కళ్యాణ్ జ్యువెలరీ షోరూం ప్రారంభోత్సవానికి ఆమె విచ్చేశారు. ఆమె చూసేందుకు యువత మండుటెండను కూడా లెక్కల చేయకుండా జగనం పడిగాపులు కాశారు. యువత కోరిక మేరకు శ్రీలీల స్టేజిమీద చిన్న స్టెప్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆకర్షణీయమైన ఆభరణాల కలెక్షన్‌తో ఆభరణాల ప్రేమికులను ఆకట్టుకుందని చెప్పారు. వినియోగదారుల అవసరాలకు తగ్గట్లు ఆభరణాలను అం దించే సమగ్ర వ్యవస్థను అం దుబాటులోకి తేవడం హర్షనీయమని తెలిపారు. కళ్యాణ్ జ్యువెలర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమేష్ కళ్యాణ్ రామన్ మాట్లా డుతూ విని యోగదారుల అవ సరాలకు అనుగుణంగా ఆభరణాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. షోరూం ప్రారంభం సందర్భంగా కొనుగోలుదారులకు విస్తృతమైన ఆఫర్లు అంది స్తున్నామని తెలిపారు. తాము విక్రయించే ఆభరణాలన్ని బిఐఎస్ హాల్ మార్క్ కలిగి ఉంటాయని చెప్పారు. ఎక్ఛ్సేంజ్, బై-బ్యాక్ విధానాలను సంస్థ అమలు చేస్తుందన్నారు.

షోరూంను ప్రారంభిస్తున్న శ్రీలీల

సామాజిక విప్లవ యోధుడు జగ్జీవన్‌రామ్

117వ జయంతి సభలో కలెక్టర్ వి.విజయ్ రామరాజు

ప్రజాశక్తి - కడప

దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతూనే, మరోవైపు సామాజిక వివక్షతను జయించిన సామాజిక విప్లవ యోధుడు డా.బాబూ జగ్జీవన్ రామ్ అని ఆయనకు దేశం యావత్తు మమతల నీరాజనాలు అర్పిస్తోందని కలెక్టర్ వి.విజయ్ రామరాజు కొనియాడారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సమతావాది, మానవతావాది డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ 117వ జయంతి వేడుకలు సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్ అధ్యక్షతన ఎన్నికల మోడల్ కోడ్ నిబంధనల మేరకు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధులుగా కలెక్టర్‌తోపాటు జెసిగణేష్ కుమార్, కడప నగర కమిషనర్ జి.ఎస్.ఎస్..ప్రవీణ్ చంద్, సాంఘిక సంక్షేమ శాఖ డిడి సరస్వతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోజు మనం స్వేచ్ఛా వాతావరణంలో నిర్భయంగా ఇలా ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నామంటే ఆదర్శనీయులు బాబు జగ్జీవన్ రామ్ లాంటి మహనీయుల కృషి ఫలితమే అని గుర్తు చేశారు. ఆ నాడు.. ఆయన కష్టపడి చదవడం వల్లనే ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొంది అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొల్పడం, వివక్షతను నిర్మూలించడంలో ఆయన చేసిన కృషికి గుర్తుగా ఆయన జన్మదినాన్ని భారత ప్రభుత్వం 'సమతా దివస్' గా పరిగణించడం జరిగిందన్నారు. బాబు జగ్జీవన్ రామ్ ఆశయ స్ఫూర్తితో జిల్లాలో సుస్థిర అభివృద్ధి కోసం అధికారులు పాటుపడాలని సూచించారు. అలాగే ప్రతి విద్యార్థీ, ప్రతి ఉద్యోగీ.. నిత్య విద్యార్థి అన్న విషయాన్ని గుర్తు చేస్తూ ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో మెలగాలన్నారు. పనిలో నిబద్ధత, కష్టపడి పనిచేసే నైజాన్ని అలవర్చుకోవాలన్నారు. విద్యతోనే విలువలతో కూడిన జీవితం లభిస్తుందని, ఉన్నత పదవులు వరిస్తాయని విద్యార్థులకు జిల్లా కలెక్టర్ హితబోధ చేశారు. జెసి మాట్లాడుతూ పట్టుదల, ఆశయ సాధనకు నిలువెత్తు నిదర్శనం డాక్టట్ బాబు జగ్జీవన్ రామ్ అని అభివర్ణించారు. డిఆర్‌ఒ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అణగారిన అన్న ఆలోచనను పక్కన పెట్టి గొప్ప ఆలోచనతో కష్టపడి ముందుకెళితేనే. ఉన్నత స్థానంలోకి వెళ్తామనే నిజాన్ని గుర్తెరగాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ముందుగా ముఖ్య అతిధులు జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎస్‌సి, మైనార్టీ కార్పొరేషన్ల ఇడి డాక్టర్ వి. బ్రహ్మయ్య, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, డిపిఒ ప్రభాకర్ రెడ్డి, ఆర్అండ్‌బి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇలు మహేశ్వర్ రెడ్డి, వీరన్న, ఫిషరీస్ డిడి శాంతి, విద్య, సాంఘిక సంక్షేమ శాఖా అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **అందరూ ఆదర్శంగా తీసుకోవాలి : డిప్యూటీ సిఎం** ..బాబు జగ్జీవన్ రామ్ ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, మేయర్, వైసిపి జిల్లా అధ్యక్షులు సురేష్‌బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు వినోద్ కుమార్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ సమీపంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి తొలుత పూలమాలవేసి నివాళులర్పించారు.. తొగట వీర క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షులు మడక చక్రధర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. **వైఎస్ఆర్ ఎఎఫ్ఎయూలో..** స్వాతంత్ర్య సమర యోధుడు, జనం కోసమే తన జీవితాన్ని అంకితం చేసిన నాయకుడు బాబు జగ్జీవన్ రామ్ అని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బి. ఆంజనేయ ప్రసాద్ అన్నారు. నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో బాబు జగ్జీవన్ రామ్ 117 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా విచ్చేసిన విసి, రిజిస్ట్రార్ బాబు జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్ కుమార్ రెడ్డి, సూపరింటెండెంట్ వై.పవన్ కుమార్ రెడ్డి, నేషనల్ ఈవెంట్ కోఆర్డినేటర్ మనోహర్, జాతీయ సేవా పథక ప్రోగ్రామ్ ఆఫీసర్లు ప్రదీప్ కుమార్, రమాదేవి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు. **పులివెందుల టౌన్ :** బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాలలో నిర్వహించారు. శుక్రవారం బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్.ఎస్.బేగ్ ఇతర అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పుష్ప నివాళులు అర్పించారు, కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ జయమ్మ, అరుణ, డాక్టర్ కీర్తి రెడ్డి, డాక్టర్ రాజేష్, డాక్టర్ నివేదిత, డాక్టర్ సాయి శ్రీనివాస్, డాక్టర్ రాజశేఖర్, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. **వేంపల్లె :** అణగారిన వర్గాల పోరాట యోధుడు బాబు జగ్జీవన్ రామ్ అని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, బిసి మండల కన్వీనర్ గోగుల మల్లికార్జునలు అన్నారు. శుక్రవారం బాబు జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని స్థానిక టిడిపి కార్యాలయంలో ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వెంకటయ్య, యుగంధర్, పాపిరెడ్డి, భాస్కర్, జబిబుల్లా, వేమ కుమార్, మడక శ్రీనివాసులుపాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** దళితుల అభ్యున్నతకి బాబు జగ్జీవన్‌రామ్ ఎంతో కృషి చేశారని పలువురు కొనియాడారు. స్థానిక అంద్రకేశరి రోడ్డులోని దళిత ప్రజాసంఘాల కార్యాల యంలో విద్యార్థి, యువజన సంఘాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మాజీ ఉపప్రధాని జగ్జీవన్‌రామ్117వ జయంతి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రగతిశీల విద్యార్థి యుజన సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ కత్తి ఓబులేసు, దళిత ప్రజాసంఘ నాయకులుగడ్డం నరసింహులు శేఖర్, రమణ, దళిత నాయకుడు పుల్లయ్య పాల్గొన్నారు. **యుటిఎఫ్ నివాళి..** బాబు జగ్జీవన్‌రామ్ 117వ జయంతి పురస్కరించుకుని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు నివాళులర్పించారు. యుటిఎఫ్ కార్యాలయంలో చిత్రపటానికి పూలమావేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి నరసింహారావు, కార్యదర్శి సి.వి.రమణ, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు బత్తుల చం ద్రశేఖర్, గోపి నాథ్, కిరణ్‌కుమార్, చెన్న కేశవులు, కొండయ్య, ఎల్లయ్య, సిద్దయ్య పాల్గొ న్నారు.

జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, జెసి, డిఆర్ఒ

పులివెందుల : జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

బలిజలకు అండగా ఉంటాం : ఎంపీ

ప్రజాశక్తి - కడప అర్బన్

వైసిపి ప్రభుత్వం బలిజలకు అన్నిరకాలుగా అండగా ఉంటామని ఎంపీ వై.ఎస్. అవినాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వైఎస్ఆర్ ఆడిటోరియంలో బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కడప, కమలాపురం నియోజకవర్గాల బలిజ వర్గీయుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కాపు నేస్తంతో బలిజలకు సంక్షేమ పథకం అందజేస్తున్నారని తెలిపారు. బలిజ భవన్‌కు కావాల్సిన సహాయం సహకారాలు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ సిఎం అంజాద్‌బాష, మేయర్ సురేష్‌బాబు, టిడిపి బోర్డు సభ్యులు మాసీమ బాబు, అడా చైర్మన్ గురుమోహన్, నాయకులు తుమ్మలకుంట శిశంకర్, తోట కృష్ణ, దాసరి శివ, కొండయ్య, రెడ్డి ప్రసాద్, శివ కేశవ, పత్తి రాజేశ్వరి, నాగమల్లిక, ఉమా మహేశ్వరి, సింధు, సాయిపేట శ్రీను, హరీంద్రనాథ్, హరప్పా, రాజా, ప్రసాద్, గోపాల స్వామి పాల్గొన్నారు.

బుక్‌లెట్ పంపిణీ : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్

పాత పెన్షన్ విధానం ప్రాధాన్యతను తెలియజేస్తూ సిపిఎస్, జిపిఎస్ పెన్షన్ విధానాల వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు పదవీ విరమణ అనంతరం కలిగే నష్టాన్ని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు తెలిపారు. శుక్రవారం యుటిఎఫ్ ముద్రించిన బుక్లెట్‌ను మూల్యాంకనంలో పాల్గొన్న ఉపాధ్యాయులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ సర్వీస్‌రూల్స్‌తో పాటు ఉద్యోగ విరమణ అనంతరం తమకు వర్తించే పెన్షన్ విధానంపై అవగాహన ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు చెరుకూరి శ్రీనివాసులు, సి.వి.రమణ, నాయకులు గోపినాథ్, బత్తుల చంద్రశేఖర్, గురుమోహన్ పాల్గొన్నారు.

బుక్‌లెట్ పంపిణీ చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా

విద్యార్థులకు క్రమశిక్షణ ముఖ్యం

- డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థులకు క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని డిప్యూటీ సిఎం అంజాద్‌బాష అన్నారు. శుక్రవారం శ్రీ శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 44వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 44వ వసంతంలోకి అడుగుపెట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. కరస్పాండెంట్ ఎలియాస్‌రెడ్డి పాఠశాల అభివృద్ధికి ఎంతో కష్టపడ్డారని చెప్పారు. నిర్మల, విద్యామందిర్ తరువాత శ్రీ శాంతినికేతన్ పాఠశాల పెట్టారని తెలిపారు. ఫీజులు కట్టేశాం, బాధ్యత ఉపాధ్యాయులదే అని తల్లిదండ్రులు అనుకుంటే పొరపాటన్నారు. తల్లిదండ్రులు ఇంటి వద్ద పిల్లలను చదవించాలని పేర్కొన్నారు. మేయర్ సురేష్‌బాబు మాట్లాడుతూ 1978లో శ్రీ శాంతిని కేతన్ స్కూల్ స్థాపించారని చెప్పారు. 1985లో బ్రాంచ్-2ను శంకరాపురంలో ఏర్పాటు చేశారని తెలిపారు. పుట్టగొడుల్లా పుట్టుకు వచ్చిన ఎన్నో స్కూల్స్ కాలగర్భంలో కలిసిపోయాయన్నారు. పూర్వపు విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. స్కూల్‌కు, తల్లిదండ్రులకు, గ్రామానికి, రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాలని పిలుపు నిచ్చారు. ఉపాధ్యాయ ఎంఎల్‌సి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదవాలని తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎలియాస్‌రెడ్డి, మాజీ ఎంఎల్‌సి సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సరెండర్ లీవ్ బకాయిల సంగతేంటి?

ప్రజాశక్తి - బద్వేలు

ప్రావిడెంట్ ఫండ్, ఎపిజిఎల్ఐ బకాయిల చెల్లింపులు సరే, సరెండర్ లీవ్ బకాయిల సంగతేంటని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. శుక్రవారం బద్వేలులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.25 వేల కోట్ల అన్ని రకాల బకాయిల్లో రూ. 5,500 కోట్లను మార్చి ఆఖరిలోగా చెల్లిస్తామని ఉద్యోగ, ఉపాధ్యాయ జెఏసి సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. హామీ మేరకు ప్రావిడెంట్ ఫండ్, ఎపిజిఎల్ఐ బకాయిలను కొంతమేరకు చెల్లించిందని, అయితే ఇచ్చిన హామీ మేరకు పూర్తిస్థాయిలో బకాయిలను చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని చెప్పారు. సరెండర్ లీవ్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించలేదన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయుల బకాయిల చెల్లింపులలో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పట్ల సవతి తల్లి ప్రేమను కనపరుస్తుందన్నారు. డిఎ, పిఆర్‌సి బకాయిల చెల్లింపులో రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందని విమర్శించారు. ఉద్యోగుల పక్షపాతిగా ప్రకటించుకునే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. జెఎసి సమావేశంలో ఇచ్చిన హామీ మేరకు సరెండర్ లీవ్ బకాయిలతో పాటు, డిఎ,పిఆర్‌సి బకాయిలను తక్షణమే ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర ప్రభుత్వం తగు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. సమావేశంలో యుటిఎఫ్ గోపవరం మండల అధ్యక్షులు వీరదాసరి క్రిష్టఫర్ పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	షహరీ
శనివారం (సా)	ఆదివారం (ఉ)
6.31	4.52

ఉత్తమ గ్రేడ్లు సాధించిన విద్యార్థులతో యాజమాన్యం, అధ్యాపకులు

సెమిస్టర్ ఫలితాల్లో 'గౌతమి' విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

అనంతపురం జెఎన్‌టియు వారు విడుదల చేసిన మొదటి సెమిస్టర్ ఫలితాలలో తమ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని గౌతమి మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. రామసుబ్బమ్మ తెలిపారు. శుక్రవారం పెద్దశెట్టిపల్లె వద్ద గౌతమి మహిళ కళాశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం ఫలితాలలో సిఎస్ఇ విభాగంలో ఎమ్.శివమణి (9.4), పి.హర్షిత (9.2), డి చాంద్ బి (8.8), ట్రిపుల్ఇ విభాగంలో వి. సుకన్య (9.3), వెంకట కీర్తి (9.1), జి. స్నేహ (9.0), ఎం. తస్లీమ్ (9.0), ఎం శైలజ (8.9), పి. వెంకట సుమ పూజిత (8.9), ఇసిఇ విభాగంలో శ్రావణి (9.0), జి. శ్రావణి (8.9), ఝాన్సీ లక్ష్మి (8.8) వంటి గ్రేడ్లు సాధించారని తెలిపారు. వీరితో పాటు 50 మంది విద్యార్థులులు 8.0 గ్రేడ్ పైగా సాధించారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను కళాశాల కరస్పాండెంట్ బాబమ్మ, డైరెక్టర్లు నాగూరు, బైరెడ్డి రవీంద్రారెడ్డి, కో- డైరెక్టర్ శైలూష , డిప్లొమా ప్రిన్సిపల్ ప్రకాష్ రావు, వివిధ విభాగ అధిపతులు సుబ్బన్న, మహమ్మద్ జబీక్, యాకూబ్ అలా, విజయమ్మ, అధ్యాపకులు, ఇతర సిబ్బంది అభినందించారు.

సగిలి బిషప్ అభిషేక ఉత్సవానికి బస్సులు

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప జిల్లా వాసి సగిలి ప్రకాష్ ఖమ్మం జిల్లా కతోలిక మేత్రాసన బిషప్ అభిషేక మహోత్సవానికి కడప నుంచి బస్సులు బయలుదేరుతున్నాయని, శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆరోగ్యమాత చర్చి లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 9న, తెలుగు సంవత్సరాది ఉగాది రోజున ఖమ్మంలోని దివ్య కారుణ్య బృహత్ దేవాలయం కరుణగిరి ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు, ప్రధాన అభిషేక పీఠాధిపతులు కార్డినల్ పూల ఆంథోనీ (హైదరాబాద్ అతి మెత్రాణులు) ఖమ్మం, కడప అపోస్తులిక పాలన అధికారి ఉడుముల బాల, గాలి బాలి, నెల్లూరు పీఠాధిపతులు ఎం.డి. ప్రకాశం ఆధ్వర్యంలో ప్రకాష్ సగిలి బిషప్ అభిషేక మహోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. వేడుకలలో పాల్గొనటానికి కడప, చిత్తూరు, పోరుమామిళ్ల, బద్వేలు ప్రాంతాల నుంచి బస్సులు బయలుదేరనున్నవని చెప్పారు. కడప నుంచి ఆరోగ్యమాత పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఫాదర్ ఎమ్‌డి ప్రసాదరావు ఆధ్వర్యంలో 8నసాయంత్రం బసు బయలుదేరుతుందన్నారు. సగిలి ప్రకాష్ కడప జిల్లాలో అనేక ప్రాంతాలలో పనిచేశారని, ఆయన పని చేసిన ప్రతి ప్రాంతంలోనూ ఆధ్యాత్మికం వెల్లువిరిసిందని తెలిపారు. ఆ కారణం చేతనే ఆయనను బిషప్‌గా చూడాలని ఎదురుచూసిన విశ్వాసులు పెద్ద సంఖ్యలో బయలుదేరనున్నారని చెప్పారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

ప్రజాశక్తి - మైదుకూరు

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని లేకపోతే విపత్తు తప్పదని మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచునూరు చంద్ర అన్నారు. శుక్రవారం తన నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీటిని ఆదా చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వేసవిలో రాబోయే రెండు నెలలు మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో భూగర్భ జలాలు అడుగంటాయని ఫలితంగా బోర్లు ఎండిపోయాయి అని అన్నారు. మున్సిపల్ చైర్మన్‌గా తనకు అవకాశం ఇచ్చిన ప్రజలకు రుణం తీర్చుకునే భాగ్యం కలిగినందుకు సంతోషిస్తున్నానని అన్నారు. సొంతంగా తన ఇంటి నుంచి రోజుకు 40 వాటర్ ట్యాంకర్లకు నీటిని పట్టి మున్సిపాలిటీ ప్రజల తాగు నీటి కష్టాలు తీర్చేందుకు కృషి చేస్తున్నానన్నారు. ఎక్కడైనా నీరు అవసరమైతే తనకు ఫోన్ చేస్తే వారికి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తానని తెలిపారు.

వడదెబ్బతో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని కుప్పం పంచాయతీ వడ్డేపల్లి గ్రామానికి చెందిన ఏనుగుల వెంకటనారాయణ (67) వృద్ధుడు వడదెబ్బతో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. అధిక ఎండలకు వడదెబ్బతో అస్వస్థతకు గురై కళ్లుతిరిగి పడిపోగా, స్థానికులు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పగికే మృతిచెందాడని పేర్కొన్నారు. ఈ ఏడాది అధిక ఎండలు ఉండడంతో వృద్ధులు ఆరు బయట తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు పేర్కొన్నారు.

మంటల్లో కాలిబూడిదైన గడ్డి వాములు

గడ్డి వాములు దగ్ధం - రూ.10 లక్షల మేర ఆస్తి నష్టం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామంలో శుక్రవారం 10 గడ్డివాములు దగ్ధమయ్యాయి. ప్రమాదవశాత్తు గడ్డివాములపై నిప్పురవ్వలు పడి మంటలు చెలరేగడంతో ఒక గడ్డివాము నుంచి మరో వాముకు మంటలు వ్యాపించాయి. దీంతో పెద్ద ఎత్తున మంటలు రావడంతో స్థానికులు ప్రొద్దుటూరు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ ఇంజన్ల సహకారంతో మంటలను ఆర్పారు. ఆదిలక్ష్మి, లక్ష్మీదేవి, శివారెడ్డి, రామ సుబ్బారెడ్డి, సుబ్బిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, అంకిరెడ్డికి చెందిన దాదాపు పది గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. దాదాపు పది లక్షలు ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు.

రాష్ట్రాభివృద్ధికి ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలి

-ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు 'భూపేష్','ఆది'

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కూటమి అభ్యర్థులను గెలిపించి రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కడప పార్లమెంటు అభ్యర్థి చదిపిరాల భూపేష్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రొద్దుటూరు రోడ్డులోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న సభా భవనంలో ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా జమ్మలమడుగుకు, కడప జిల్లాకు ఏం చేశారని ప్రశ్నించారు. సొంత చిన్నాన్న చంపిన వ్యక్తిని పక్కన పెట్టుకొని దేవగుడి కుటుంబంపైనా, బీటెక్ రవి పైనా నిందలు వేయడం ఏమిటని ప్రశ్నించారు. జగన్ సైకో కాదు మోసగాడని విమర్శలు చేశారు. గండికోట ముంపు వాసులకు 10 లక్షల నష్టపరిహారం ఇస్తామని చెప్పి ఇప్పటికీ వైసిపి ప్రభుత్వం ఇవ్వలేకపోయిందని పేర్కొన్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి కొండాపురం మండలంలోని గండికోట ముంపు ప్రాజెక్టు బాధితులకు గతంలో ఇచ్చిన దానికంటే అదనంగా ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి టిడిపి జనసేన రాష్ట్ర జిల్లా ప్రధాన నేతలతో పాటు భారీ స్థాయిలో నియోజకవర్గంలోని ప్రజలు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న ఆదినారాయణరెడ్డి

సంక్షేమం, అభివృద్ధి చూసి ఆదరించాలి

ప్రజాశక్తి - చాపాడు

సంక్షేమం, అభివృద్ధి చూసి ఆదరించాలని కడప ఎంపీ వై.ఎస్. అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చియ్యపాడు గ్రామంలో ఎంపీ, ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించామన్నారు. ఐదేళ్లల్లో లబ్ధిచేకూరి ఉంటేనే ఓట్లు వేయాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో వైసిపికి పట్టం కట్టాలన్నారు. ప్రజలకు మంచి చేయడం వలనే ఘన స్వాగతం పలుకుతూ ఆదరిస్తున్నారని తెలిపారు. అనంతరం ఎంఆర్‌పిఎస్ నాయకులు కర్ణా మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎంపీ, ఎంఎల్‌ఏ లను గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు తిరుపాల్ రెడ్డి , సంబటూరు ప్రసాద్ రెడ్డి, జిల్లా వక్స్ బోర్డ్ చైర్మన్ మదీనా దస్తగిరి, వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డి, ఎంపీపీ టి లక్ష్మయ్య, శాంతరాజు, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీమన్నారాయణ రెడ్డి, వైసిపి నాయకులు ఎస్ ఆర్ బాల నరసింహారెడ్డి, పీవీ రమణారెడ్డి, మండల రామ్మోహన్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఆర్ వి సుబ్బారెడ్డి, బోలోరో బాషా, జయ రామిరెడ్డి, నారాయణరెడ్డి, సర్పంచ్ లు శ్రీనువాసుల రెడ్డి, కిశోర్ కుమార్ రెడ్డి, నాయకులు మహేశ్వర్ రెడ్డి, సిద్దారెడ్డి, శివప్రసాద్, ఓబులేసు, మహేష్, నిరంజన్ రెడ్డి, రాజేంద్రనాథ్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వై.ఎస్.కొండారెడ్డి ఇంటింటి ప్రచారం

చక్రాయపేట : మండలంలోని కల్లూరుపల్లి పంచాయతీలో దుద్దుకుంటూవారిపల్లె, కల్లూరు పల్లె తండాలలో బిసి కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ సభాపతి నాయుడు, ఆ గ్రామ సర్పంచ్ పురుషోత్తం నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల ఇన్‌ఛార్జి వైయస్ కొండారెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. వారికి బ్యాండ్ మేళాలతో, బానసంచారాలతో, పూలమాలలతో ఘనంగా స్వాగతం పలికారు. గతంలో కంటే ఈ ఎన్నికల్లో అధిక మెజార్టీ వచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బెల్లం ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఎంపిపిమాధవి బాలకృష్ణ, జెసిఎస్ కన్వీనర్ లోమడ రామాంజనేయరెడ్డి, ఎంపిపి గఫూర్, ఎర్రగుడి సర్పంచ్ హరి, కల్లూరుపల్లి తాండ వైఎస్ఆర్ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారంలో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎంపీ వైస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల రూరల్ : రాష్ట్ర అభివృద్ధి కోసం విశేషంగా కృషిచేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, కడప జిల్లాను అభివృద్ధి చేసిన ఎంపీ వై.ఎస్. అవినాష్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని పులివెందుల మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వై.ఎస్.మనోహర్‌రెడ్డి ఓటర్లకు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని పాత ఈసీ గంగిరెడ్డి ఆస్పత్రి నుంచి ప్రచారాన్ని ప్రారంభించారు. జెండామాను వీధి శ్రీనివాస థియేటర్ ప్రాంతాలలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న వై.ఎస్. జగన్మోహన్ రెడ్డికి, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వైయస్ అవినాష్ రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, రాష్ట్ర సివిల్ సప్లై చైర్మన్ గంగాధర్ రెడ్డి , మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, కోళ్ల భాస్కర్, తోపాటు వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

టిడిపితోనే ప్రజలకు సంక్షేమ ఫలాలు : 'పుట్టా'

ఓట్లు అభ్యర్థిస్తున్న టిడిపి అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్

ప్రజాశక్తి-మైదుకూరు

తెలుగుదేశం పార్టీ గెలిస్తేనే ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతామని నియోజకవర్గ టిడిపి అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ పేర్కొన్నాపరు. శుక్రవారం మండలంలోని గంజికుంట పంచాయతీ లెక్కలవారిపల్లె గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే తమ ప్రభుత్వం అమలు చేసే పథకాల గురించి ఆయన వివరించారు. గ్రామ స్తులు తమ ఓటును తెలుగుదేశం పార్టీకి వేయించి గెలిపించాలని ఆయన కోరారు. అధికారంలోకి వచ్చిన వెంటనే తమప్రభుత్వం చేయబోయే పథకాల గురించి ప్రజలకు ఆయన వివరించారు. దీపం పథకం కింద ప్రతి కుటుంబానికీ ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామన్నారు. ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యం, ఆడబిడ్డ నిధి కింద 18 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇవ్వడం జరుగుతుందన్నారు. తల్లికి వందనం పథకం కింద ప్రతి ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంతమందికి ఏడాదికి రూ.15 వేలు వారి తల్లుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. యువగళం నిధి కింద ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3000, అన్నదాత పథకం ద్వారా ప్రతి రైతుకు ఏడాదికి రూ.20వేలు ఆర్థిక సహాయం, బిసిలకు 50 సంవత్సరాలకే పెన్షన్ అమలు చేస్తామని, అర్హులైన అవ్వ తాతలకు నెలకు రూ.4000 పెన్షన్ పెంచుతామని అన్నారు.

రాష్ట్ర అభివృద్ధి టిడిపితోనే సాధ్యం

ఖాజీపేట : ఆంధ్రరాష్ట్ర అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని, రానున్న ఎన్నికల్లో ప్రజలు అందరూ చంద్రబాబు నాయుడుకే పట్టం కట్టాలని మైదుకూరు టిడిపి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. శుక్రవారం మండలం పరిధిలోని పత్తూరు పంచాయతీ డాం ఖాన్‌పల్లె, నాగపట్నం గ్రామాలకు చెందిన వైసిపి నాయకులు గడ్డం గంగి నాయుడు, మురళీ అనుచర వర్గానికి చెందిన వారు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. సందర్భంగా పుట్టా సుధాకర్ యాదవ్, పార్టీ మండలం అధ్యక్షులు లక్ష్మి రెడ్డి లు పార్టీ కండువా వేసి సాధారం గా ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గం మల్హోత్రా, టిడిపి నాయకులు సందుల నాగశివా రెడ్డి, పిచ్చి నాయుడు, పుల్లయ్య నాయుడు, హరినాథ్ రెడ్డి, జానకి రామ్ నాయుడు, ముస్లిం మైనారిటీ నాయకులు కమలాపురం ఫరూక్, మాజీ జడ్‌పిటిసి గోవింద్‌రెడ్డి, ఎంపిటిసి భాస్కర్ రెడ్డి, వీరయ్య, తుట్టే రాముయాదవ్ పాల్గొన్నారు.

వర్తకులను కించపరచడం చంద్రబాబుకు తగదు

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

వర్తకులు, వ్యాపార కార్యక్రమాల మాటున అసాంఘిక చర్యలకు పాల్పడుతున్నారుంటూ ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు మాట్లాడడం సబబు కాదని పులివెందుల ఆర్యవైశ్యులు అన్నారు. శుక్రవారం పులివెందులలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చంద్రబాబు రావులపాలెంలో నిర్వహించిన బహిరంగ సభలో వర్తకులు నిత్యావసర సరుకుల మాటున గుట్కా గంజాయి, ఇతర నిషేధిత పదార్థాలను సరఫరా చేస్తున్నారంటూ చేసిన వ్యాఖ్యలపై ఆర్య వైశ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 40 సంవత్సరాల రాజకీయ అనుభవం ,దేశానికి దిశా నిర్దేశం చేశానంటూ చెప్పుకునే చంద్రబాబు ఒక వర్గం వారిని అవమానించే విధంగా మాట్లాడడం సరికాదని హితవు పలికారు. ఆ వర్గం వారు చంద్రబాబు పార్టీలో కూడా ఉన్నారని, బహిరంగ సభలలో ఏదైనా మాట్లాడాలనుకుంటే ఆ వర్గం వారి అభిప్రాయాలను తీసుకుంటే బాగుంటుందని పేర్కొన్నారు. కేవలం ఎన్నికల సమయాలలో ఇలాంటి మాటలు మాట్లాడడం భావ్యం కాదని, కరోనా లాంటి విపత్కర పరిస్థితులలో అన్ని వ్యాపార సంస్థలు మూసివేసి ఇంటి గడప దాటలేదని అలాంటి పరిస్థితులలో కూడా ప్రాణాలకు తెగించి ప్రజలకు నిత్యవసర సరుకులను ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకుంటూ అందజేశామని చెప్పారు. అటువంటి వ్యాపార వర్తకులను కించపరిచే విధంగా మాట్లాడడం చంద్రబాబుకే చెల్లుతుందని రాజకీయ లబ్ధి కోసం ఇలాంటివి దిగజారుడు మాటలు మాట్లాడడం తగదని, రానున్న సార్వత్రిక ఎన్నికలలో వర్తక వాణిజ్య వ్యాపారులు ఆయనకు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు కరుణాకర్, జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కొత్త రవికుమార్, పులివెందుల వర్తక యూనియన్ అధ్యక్షుడు పుల్లగూర సుధాకర్, గండి ఆంజనేయ స్వామి దేవస్థానం సభ్యుడు పబ్బతి సాగర్, పులివెందుల అమ్మవారి శాల ట్రెజరర్ గంగాధర, పుల్లయ్య పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్యవైశ్యులు

పెన్షన్లపై వైసిపి రాజకీయ డ్రామా

ప్రజాశక్తి - కడప అర్బన్

సామాజిక పెన్షన్ల పంపిణీకి డబ్బులు మంజూరు చేయకుండా, టిడిపి వల్లే పెన్షన్లు ఆగిపోయాని చెబుతూ వైసిపి రాజకీయ డ్రామాలు ఆడుతుందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు బి.హరిప్రసాద్ విమర్శించారు. శుక్రవారం హరిటవర్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి శవ రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. ఇలాంటి ప్రభుత్వాన్ని ప్రజలు గద్దెదించడం ఖాయమని హెచ్చరించారు. పెన్షన్ సొమ్మును జగన్ అనుచులకు దోచిపెట్టారని విమర్శించారు. ఖజానా ఖాళీ చేసి పెన్షన్ల డ్రామాలకు తెరలేపిందని పేర్కొన్నారు. కొన్ని చోట్ల పెన్షన్లకు సంబంధించిన నగదు జమ చేయలేదని తెలిపారు. కొంతమంది వాలంటీర్లను అడ్డుపెట్టుకుని టిడిపిపై దుష్ప్రచారం చేస్తుందని చెప్పారు. సచివాలయ ఉద్యోగుల ద్వారా పెన్షన్లు పంపిణీ చేయాలని చంద్రబాబు ఎన్నికల కమిషన్‌ను కోరారని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ సినిమాకు ప్రతి చోటా రెవెన్యూ అధికారులను పెట్టించిన జగన్ సామాన్య ప్రజలకు పెన్షన్లు ఇవ్వాలన్న ఆలోచన లేదా అన్ని ప్రశ్నించారు. జగన్ కనుసన్నల్లో చీఫ్ సెక్రటరీ, డిజిపి పని చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల కమిషన్ వీరిని ఎన్నికలకు దూరంగా ఉంచాలని కోరారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, ప్రొద్దుటూరు నాయకులు ముక్తియార్, జిల్లా నాయకులు చలపతి, ఈశ్వర్ పాల్గొన్నారు.

బలిజల ఆత్మీయ సభలో ఇతరులు ఉండడం ఏమిటి?

నగరంలోని వైఎస్ఆర్ ఆడిటోరియంలో చేపట్టిన బలిజల ఆత్మీయ సభలో ఇతర కులాల వారు ఉండడం ఏమిటని బలిజ సంఘం నాయకులు హరిప్రసాద్ ప్రశ్నించారు. శుక్రవారం హరిటవర్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థులకు బలిజకులస్థులు మద్దలు ఇవ్వాలని నిర్ణయించారని పేర్కొన్నారు. టిడిపి రాజంపేట టికెట్ బలిజలకు ఇచ్చిందని తెలిపారు. బలిజల సమావేశంలో వైసిపి రెడ్లు వచ్చారని చెప్పారు. బలిజ భవన్ కోసం టిడిపి హయాంలో సాయిప్రతాప్ ఇంటి సమీపంలో స్థలం చూస్తే వైసిపి నాయకులు కబ్జా చేశారని విమర్శించారు. కడపలో మాధవి రెడ్డి, రాజంపేటలో సుగవాసి సుబ్రహ్మణ్యంను గెలిపించాలని కోరారు. సమావేశంలో బలిజ నాయకులు నాగరాజు, ఈశ్వర్, చలపతి, శంకర్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా : 'వరద'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

తాను ఎప్పుడూ కార్యకర్తలకు అండగా ఉంటానని, వచ్చేది తెలుగుదేశం పార్టీ ప్రభుత్వమేనని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఈశ్వర్ రెడ్డి నగర్ లో దాదాపు 100 కుటుంబాలు ఎమ్మార్పిఎస్ బాలయ్య ఆధ్వర్యంలో టిడిపిలో చేరాయి. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వరదరాజుల రెడ్డి, నంద్యాల కొండారెడ్డి, కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, చల్లా రాజగోపాల్ యాదవ్ ను రామేశ్వరం నుంచి ఈశ్వర్ రెడ్డి నగర్‌కు ర్యాలీగా తీసుకువెళ్లారు. అనంతరం వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ ఈశ్వర్‌రెడ్డి నగర్, పెన్నా నగర్ తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి చెందాయన్నారు. ప్రస్తుత వైపిపి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి అభివృద్ధి పేరుతో కోట్లు దోచుకుంటున్నారని విమర్శించారు. అభివృద్ధి జరిగింది రాచమల్లు, ఆయన కుటుంబ సభ్యులు, ఆయన అనుచరులకేనని, ప్రొద్దుటూరు పట్టణంలో కాదన్నారు. ఈ అవినీతి ఎమ్మెల్యే రాచమల్లుకు బుద్ధి చెప్పాల్సింది ప్రొద్దుటూరు ప్రజలే అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నిర్భయంగా ఉపయోగించుకోవాలన్నారు. పార్టీ కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ముక్తియార్, సుధాకర్ రెడ్డి, ఘంటసాల వెంకటేశ్వర్లు, పెద్ద గంగయ్య, చిన్న గంగయ్య, వంశీ, శివకుమార్, బాలకృష్ణ, అక్కమ్మ, లక్ష్మి పెద్ద సంఖ్యలో టిడిపి కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వరదరాజులరెడ్డి

కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు, పోలీసులు

సమస్యాత్మ గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని సమస్యాత్మక గ్రామాలలో కేంద్ర సాయుధ బలగాలతో శుక్రవారం పోలీసులు ఖాదర్‌పల్లి, కేతవరం, విశ్వనాథ పురం, నెర్రవాడ గ్రామాలలో మైదుకూరు రూరల్ సిఐ శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యం అన్నారు. ప్రజల్లో ఉన్న భయాందోళనను పోగొట్టి, రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ కొండారెడ్డి, పోలీసులు, సిఆర్‌పిఎఫ్ జవాన్లు పాల్గొన్నారు.

అన్నమయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

అన్నమయ్య సంకీర్తనలు అజరామరం

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

అన్నమయ్య సంకీర్తనలు అజరామరమని ఈ సంకీర్తనల తన భక్తిని చాటుకున్నారని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి అన్నారు. స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవాకేంద్రంలో శుక్రవారం అన్నమయ్య వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్నమయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య తన సంకీర్తనల ద్వారా తెలుగు సంగీతానికి సాహిత్యానికి ఎనలేని సేవచేశారని పేర్కొన్నారు. పదకవితా పితామహుడు అని పేరు గాంచిన అన్నమయ్య తన సంకీర్తనల ద్వార శ్రీ వెంకటేశ్వరుని భక్తిలో తరించాడన్నారు. ఆయన చూపిన గానామృతంలో తడవని తెలుగువాడు లేడంటే అతిశయోక్తి కాదన్నారు. కార్యక్రమంలో ప్రముఖ భాగవతార్ యడవల్లి రమణయ్య, డాక్టర్ హరి, రాయలసీమ వ్యాయామ శిక్షణ కళాశాల ప్రిన్సిపల్ రవిశంకర్, అధ్యాపకులు పంజగల మధుసూదన్‌బాబు, కోటా ఓబులరెడ్డి, రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షులు సాయికుమార్, కోశాధికారి భోగా గంగాధర్ బత్తల వెంకట ప్రసాద్ పాల్గొన్నారు.

చంద్రబాబుకు వృద్ధుల ఉసురు తగులుతుంది : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

ఇంటి వద్దకే పెన్షన్ పంపిణీని అడ్డుకున్న చంద్రబాబుకు వృద్ధుల ఉసురు తగులుతుందని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన స్వార్థ రాజకీయాలతో 66 లక్షల మంది పేదవారిని బాధించాడన్నారు. నడవలేని పెన్షన్‌దారులను పెన్షన్ కోసం సచివాలయాలకు మంచాలపై తీసుకెళ్లాల్సి వస్తోందన్నారు. రానున్న రోజుల్లో పెన్షన్‌ను రూ.3వేల నుంచి పెంచుతామని ముఖ్యమంత్రి చెప్పారని ఆయన గుర్తు చేశారు. వాలంటీర్ల వ్యవస్థను చూసి చంద్రబాబు వెన్నులో వణుకు పుట్టోందన్నారు. ఎన్నికల కమిషన్‌కు తనవారితో పిర్యాదు చేయించారన్నారు. 2024లో తమ ప్రభుత్వం ఏర్పడ్డాక తొలి సంతకం వాలంటీర్ల వ్యవస్థపైననే అని ముఖ్యమంత్రి చెప్పడం సంతోషకరమన్నారు.

టిడిపి నుంచి వైసిపిలో చేరిన వంద కుటుంబాలు

ప్రజాశక్తి - కడప

చలమారెడ్డిపల్లిలో కార్పొరేటర్ సుబ్బారెడ్డి, మాజీ కార్పొరేటర్ బాలకొండయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్‌బాషా కడప నగర మేయర్ కె.సురేష్ బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి సమక్షంలో దాదాపు 100 కుటుంబాలు వైసిపిలో చేరాయి. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ చల్లా పవన్ కుమార్, నంద్యాల సాయి, వెంకటరామిరెడ్డి, నరసింహారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, విజయ్ కుమార్, వారి కుటుంబ సభ్యులు బంధు మిత్రులు సుమారు 100 కుటుంబాలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. సామాజిక సేవ చేస్తూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైసిపిలో చేరి ప్రజలకు సేవ చేయాలని దృఢ సంకల్పంతో మాజీ కార్పొరేటర్ బాలకొండయ్య ఃను పార్టీలోకి ఆహ్వానిస్తున్నాం అన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు నారపురెడ్డి సుబ్బారెడ్డి, కార్పొరేటర్లు సుబ్బారెడ్డి, రామ లక్ష్మణ్ రెడ్డి, కిరణ్, మాజీ కార్పొరేటర్ బాలకొండయ్య,మార్కెట్ యార్డ్ చైర్మన్ బంగారు నాగయ్య యాదవ్, నాయకులు రామ్మోహన్ రెడ్డి, రమేష్ రెడ్డి, మాస్టర్ అహ్మద్, బెల్లం సుబ్బయ్య పాల్గొన్నారు. **మరో 50 కుటుంబాలు..** కడప నగరంలోని 44వ డివిజన్ పరిధిలో టిడిపి మహమ్మద్ స్కూల్ డైరెక్టర్ అబ్దుల్ కబీర్, మహమ్మద్ అబ్దుల్ అజీజ్ అక్రమ్ వారి మిత్రబృందం వైసిపిలో చేరారు. వారికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు ఎస్.బి.అంజాద్‌బాషా పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు నారపురెడ్డి సుబ్బారెడ్డి, రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ బోర్డ్ చైర్మన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, కార్పొరేటర్లు రామకృష్ణారెడ్డి, మహమ్మద్ షఫీ, అజ్మతుల్లా, జఫ్రుల్లా, నాయకులు జేజేరెడ్డి, ఎల్లారెడ్డి ,జయచంద్రారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి , షేక్ జమీల్, నందలూరు ఫయాజ్, షఫీ, రమేష్‌రెడ్డి, మాస్టర్ అహ్మద్, మున్నా , అఖిల్, చాంద్ బాషా, నాగ మల్లారెడ్డి ,కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రజా మద్దతు వైసిపికే : 'రాచమల్లు'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రజా మద్దతు వైసిపికే ఉందని ఎమ్మెల్యే అభ్యర్థి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తన సతీమణి, కౌన్సిలర్ రాచమల్లు రమాదేవి, తనయుడు రాచమల్లు రాఘవేంద్ర రెడ్డితో కలిసి గోపవరం పంచాయతీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వారికి జెసిఎస్ మండల కన్వీనర్ ఓబయ్య యాదవ్, సర్పంచ్ గడ్డ మోష, మాజీ సర్పంచ్ దేవి ప్రసాదరెడ్డి ఘన స్వాగతం పలికారు. మరొకమారు తనకు ఎమ్మెల్యేగా, ఎంపీగా అవినాష్ రెడ్డికి, సీఎంగా వైఎస్ జగన్మోహన్ రెడ్డికి అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, వైసిపి పట్టణ మహిళా అధ్యక్షురాలు కోనేటి సునంద, మాజీ కౌన్సిలర్ అగ్గారపు శ్రీనివాసులు, సీనియర్ వైసిపి నాయకులు కొండయ్య, వార్డు మెంబర్లు మధు, సిద్దయ్య, వెంకట్, ఎంపిటిసి భూషణ్ రవి, మాజీ ఉప సర్పంచ్ రాఘవ, ఎంపీటీసీలు మహేష్, దస్తగిరి రెడ్డి, సీనియర్ నాయకులు వేమారెడ్డి, వార్డు మెంబరు ఆదిరెడ్డి, వెంకట రాముడు, మాజీ వార్డు మెంబర్ మేరీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HONORABLE PRINCIPAL DISTRICT JUDGE : KADAPA

I.A.No. 644/2022
C.M.A.No. /2022
O.S.No. 122/2016

Vennapusa Lakshmi Kanthamma, W/o Prakash Reddy, M.G.150, A.P.G.H.C.Colony, Kadapa.
...Petitioner

Vs

Gajjala Venkata Subba Reddy, Having died His Lrs. Gajjala Venkata Subbamma (Wife), D.No.2/31, Papasahebpet, C.K.Dinne Mandal, Kadapa District.
...Respondent No.2

నోటీసు

పై నెంబరులో వాది బాకీ నిమిత్తమై ప్రతివాదిపై దావా దాఖలు చేసియున్నారు. 2వ ప్రతివాది నోటీసుకు గాను 08.04.2024వ తేదీన వాయిదా వున్నది. 2వ ప్రతివాదికి ఆక్షేపణలు ఉన్నా పై కోర్టులో ఉదయం గం॥10.30లకు వాయిదాకు హాజరై తెలుపుకొనవచ్చును. లేనంతట పరోక్షంలో ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.

P.PRATHAP REDDY
Advocate,
Kadapa.